

బలహీనవర్గాలపై చిన్నచూపు

బడుగు, బలహీనవర్గాలపై పాలకులు చిన్నచూపు చూస్తున్నారని మాజీ ఎంపీ వీహెచ్ మండిపడ్డారు.

10లో



చిన్నారులకు కన్నీటి వీడ్కోలు

మధిర మండలం రాయపట్నంలో తండ్రి చేతిలో హతమైన ఇద్దరు చిన్నారులకు బంధువులు అంత్యక్రియలు నిర్వహించారు.

8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం 33° / 25°

జిల్లాలో బుధవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. కొన్నిచోట్ల ఆకాశం మేఘావృతమై జల్లులు కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

క్రమశిక్షణతో ముందుకు సాగితేనే విజయం



హాస్టల్‌లో భోజనాన్ని పరిశీలిస్తున్న న్యాయమూర్తి జావేద్‌పాషా

ఖమ్మంలీగల్: సంక్షేమ హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులు దురలవాట్లకు దూరంగా ఉంటూ క్రమశిక్షణతో చదువుకుంటేనే విజయం సొంతమవుతుందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి మహ్మద్ అబ్దుల్ జావేద్‌పాషా తెలిపారు. ఖమ్మం నెహ్రూనగర్‌లోని బాలల సదనం, గిరిజన సంక్షేమ హాస్టల్‌ను మంగళవారం సందర్శించిన న్యాయమూర్తి విద్యార్థులతో మాట్లాడారు. సెల్‌ఫోన్లు, ఇంటర్‌నెట్‌తో సమయాన్ని వృథా చేసుకోకుండా చదువుకోవాలని సూచించారు. కాగా, విద్యార్థులు భోజనం విషయంలో ఫిర్యాదు చేయగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కాగా, న్యాయసేవాధికార సంస్థ సమావేశ మందిరంలో మానేర్ లా కళాశాల చివరి సంవత్సరం విద్యార్థులకు ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో కూడా జావేద్‌పాషా మాట్లాడారు.

నూరు శాతం ఫలితాల సాధనకు కృషి



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ శర్మ

ముదిగొండ: విద్యార్థులకు మెరుగైన రీతిలో బోధిస్తూ వంద శాతం ఫలితాలు నమోదయ్యేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈఓ సోమశేఖరశర్మ సూచించారు. ముదిగొండలోని జెడ్పీ ఉన్నత పాఠశాలను మంగళవారం డీఈఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా పదో తరగతి విద్యార్థుల సామర్థ్యాలను సబ్జెక్టుల వారీగా పరీక్షించారు. ఆతర్వాత ఉపాధ్యాయులతో సమావేశమై విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా చూస్తూ బోధించాలని ఆదేశించారు. హెచ్‌ఎం వెంకట్రాంరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా నవీన్‌బాబు



నవీన్‌బాబు

ఖమ్మంమయూరిసెంటర్: ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా నవీన్‌బాబు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఈడీగా ఉన్న ఏలూరి శ్రీనివాసరావు మాతృశాఖకు వెళ్లడంతో నవీన్‌బాబుకు అధికారులు బాధ్యతలు అప్పగించారు. ఈమేరకు సోమవారం రాత్రి ఉత్తర్వులు వెలువడగా ఆయన మంగళవారం కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించాక మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కాగా, నవీన్‌బాబుకు కార్యాలయ అధికారులు, ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

ఇన్‌స్పైర్ మనాక్ అవార్డుకు దరఖాస్తు చేసుకోండి

ఖమ్మం సహకారనగర్: ప్రస్తుత విద్యాసంవత్సరం ఇన్‌స్పైర్ మనాక్ అవార్డు కోసం విద్యార్థులు వచ్చే నెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ సోమశేఖరశర్మ సూచించారు. www.inspireawards.dst.gov.in లింక్ ద్వారా ఈ–మేనేజ్‌మెంట్ ఆఫ్ ఇన్‌స్పైర్ అవార్డు స్కీమ్ (ఈ–ఎంఐఏఎస్) వెబ్‌పోర్టల్‌లో లేదా ఇన్‌స్పైర్ మనాక్ యాప్ ద్వారా ప్రతీ పాఠశాల నుంచి ఐదు ఉత్తమ ఆలోచనలను నామినేట్ చేయాలని తెలిపారు. ఆరు నుంచి పదో తరగతి లోపు విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీసేందుకు ఈ అవార్డులు అందజేస్తుండగా, ప్రతిభ కనబర్చిన వారికి రూ.10వేల చొప్పున అందుతాయని డీఈఓ వెల్లడించారు.

యూసీసీ బిల్లుపై రాజీ లేని పోరాటం

ఎంపీ నామ నాగేశ్వరరావు

ఖమ్మంమయూరిసెంటర్: కేంద్రం ప్రవేశపెట్టాలని చూస్తున్న ఉమ్మడి పౌర స్మృతి బిల్లు దేశాభ్యున్నతికి గొడ్డలి పెట్టుగా మారుతుందని బీఆర్‌ఎస్ లోక్‌సభా పక్షనేత, ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భిన్నత్వంలో ఏకత్వంగా ఉన్న దేశంలో ఈ చట్టం ద్వారా పౌరుల స్వేచ్ఛకు భంగం కలుగుతుందని తెలిపారు. ప్రజల మధ్య చిచ్చుపెట్టేలా ఉన్న బిల్లును పార్లమెంట్‌లో అడ్డుకుని తీరుతామని స్పష్టం చేశారు. ఈ విషయంలో సీఎం కేసీఆర్ నేతృత్వాన పోరాడుతూ, ఉభయ సభలను స్తంభింపజేస్తామని ఎంపీ చెప్పారు.

పని పాతర.. పైరవీల జాతర!

ఎక్సైజ్ శాఖలో బదిలీల కోలాహలం

- అనువైన పోస్టింగ్ కోసం నేతల చుట్టూ సీఐల ప్రదక్షిణలు
- నిఘా లేక పేట్రేగిపోతున్న గంజాయి రవాణాదారులు
- తూతూ మంత్రం తనిఖీలతోనే సరిపెడుతున్న అధికారులు



ఖమ్మం క్రైం: మునుపెన్నడూ లేనివిధంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఎక్సైజ్ శాఖలో గందరగోళం నెలకొంది. దాదాపు అన్ని స్టేషన్ల సీఐలు తమకు అనుకూలంగా పోస్టింగ్‌ల కోసం పైరవీల బాట పట్టారు. గతంలో ఇలాంటి పరిస్థితి పోలీసు శాఖలో కనిపించగా.. ఇప్పుడు ఎక్సైజ్ అధికారులు కూడా 'మంచి' పోస్టింగ్ కోసం ప్రజాపతినిధుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. వారం, పది రోజులుగా సీఐలు పోస్టింగ్‌లు దక్కించుకునే ప్రయత్నాల్లో నిమగ్నం కాగా, తనిఖీలు తగ్గిపోవడం గంజాయి రవాణాదారులకు కలిసొస్తోంది. అయితే, అప్పుడప్పుడు నామమాత్రపు తనిఖీలు చేపడుతూ గంజాయి పట్టుకున్నామని చెబుతూ కాలం గడుపుతుండడం గమనార్హం.

బదిలీలు తెచ్చిన ప్రకంపనలు

ఎక్సైజ్ శాఖ ఉద్యోగుల బదిలీలు గతంలో శాఖ కమిషనర్ ద్వారా మాత్రమే జరిగేవి. కానీ ఇదంతా గతంగానే మిగిలిపోగా.. ఇప్పుడు పరిస్థితి మారింది. నాలుగు నెలల క్రితం ఖమ్మం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఇద్దరు సీఐల బదిలీలతో మొదలైన ప్రకంపనలు శాఖలో గందరగోళాన్ని సృష్టించాయి. అనంతరం ఇటీవల మళ్లీ ముగ్గురు, నలుగురు సీఐల బదిలీ జరిగింది. ఇవన్నీ కూడా సిఫారసు లేఖలతోనే జరిగాయనే ప్రచారం మొదలైంది. దీంతో ఏళ్లుగా బదిలీ కోసం ఎదురుచూస్తున్న ఉమ్మడి జిల్లాలోని పలువురు ఎక్సైజ్ సీఐలు కూడా బదిలీ చేయించుకుని అనువైన పోస్టింగ్ దక్కించుకునేలా పైరవీల బాట పట్టారు.

అందుబాటులో ఉండని సీఐలు

పోస్టింగ్‌ల కోసం పైరవీల బాట పట్టిన ఎక్సైజ్ సీఐలు కొద్దిరోజులుగా స్టేషన్లలో అందుబాటులో ఉండటం లేదనే విమర్శలు వస్తున్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఆరు, ఖమ్మం జిల్లాలో ఏడు ఎక్సైజ్ స్టేషన్‌లు ఉండగా.. వీటికి తోడు ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్, చెక్‌పోస్టులు, మద్యం డిపోలో కలిపి సుమారు 20మందికి పైగా సీఐలు విధులు నిర్వర్తిస్తున్నారు. వీటిలో సగానికి పైగా పోస్టింగ్‌ల ద్వారా మంచి ఆదాయం లభిస్తుందనే పేరుంది. అయితే, ఆయా ప్రాంతాల్లో విధులు నిర్వర్తిస్తున్న సీఐలు ఐదేళ్లు దాటినా బదిలీ కావడం లేదు. కానీ ఇప్పుడు వీరు కూడా మరో చోట మంచి పోస్టింగ్ దక్కించుకునేలా పైరవీల్లో నిమగ్నమైనట్లు సమాచారం. ఇలా కారణాలు ఏమైనా స్టేషన్లలో పాలన, తనిఖీలు కుంటుపడ్డాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

గంజాయి రవాణాదారుల ఇష్టారాజ్యం

కొద్ది రోజుల క్రితం వరకు స్తబ్దుగా ఉన్న గంజాయి రవాణాదారులు ఇటీవల వరుసగా పట్టుబడుతున్నారు. దీనికి కారణం నిఘా లోపించడమేనని తెలుస్తోంది. పోస్టింగ్‌ల కోసం సీఐలు తిరుగుతుండడంతో మిగతా ఉద్యోగులు నామమాత్రంగానే తనిఖీలు చేపడుతున్నారు. దీంతో ఒడిశా నుంచి ఉమ్మడి జిల్లాల మీదుగా ముంబై, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు గంజాయి తరలిస్తున్న వారు అడపాదడపా పట్టుబడుతున్నారు. కానీ తరలించేది వేల కిలోలు కాగా.. పట్టుబడుతున్న వందల కిలోలేనని తెలుస్తోంది.

అధికార పార్టీ నేతల అండ తప్పనిసరి

అధికార పార్టీ నాయకుల అండ ఉంటే చాలు నచ్చిన పోస్టింగ్ దొరికినట్లేననే భావన ఉద్యోగుల్లో వ్యక్తమవుతోంది. దీంతో పలువురు సీఐలు తమకు ఉన్న పరిచయాలు, పలుకుబడి, సామాజిక వర్గాల ఆధారంగా పైరవీలు నడుపుతున్నారు. ఇందులో కొందరు అధికార పార్టీ నాయకుల సహకారంతో.. మరికొందరు ఏకంగా హైదరాబాద్‌లోని పెద్దల ద్వారా ప్రయత్నాలు మొదలుపెట్టారు. నచ్చిన చోట పోస్టింగ్ ఇప్పిస్తే ఎంత డబ్బయినా ఇవ్వటానికి వారు సిద్ధపడుతున్నట్లు సమాచారం. ఇంకొందరు సీఐలైతే బడా మద్యం వ్యాపారుల ద్వారా యత్నాలు చేస్తున్నట్లు సమాచారం. ఇదే సమయాన సిండికేట్ కింగ్‌లు అయిన మద్యం వ్యాపారులు సైతం తమకు అనుకూలంగా ఉండే అధికారిని తెచ్చుకునేందుకు డబ్బు సమకూర్చడానికి ముందుకొస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

పదోన్నతి పొందిన వారికే పోస్టింగ్



ఉమ్మడి జిల్లాలో ఎస్‌ఐ నుంచి సీఐగా పదోన్నతి పొంది వెయిటింగ్‌లో ఉన్న వారికి మాత్రమే పోస్టింగ్‌లు వస్తున్నాయి. అంతే తప్ప ఎక్కడా రాజకీయ బదిలీలు లేవు. ఎక్సైజ్ శాఖ నిబంధనల మేరకు మాత్రమే బదిలీలు జరుగుతున్నాయి. ఉమ్మడి జిల్లాల్లో గంజాయి రవాణాను అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నాం.

– జనార్దన్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్

శరవేగంగా అభివృద్ధి పనులు



వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్, పక్కన అదనపు కలెక్టర్ స్నేహలత, అధికారులు

- అధికారులు నిరంతరం పర్యవేక్షించాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ గౌతమ్

ఖమ్మం సహకారనగర్: జిల్లాకు మంజూరైన గ్రామ పంచాయతీ భవన నిర్మాణాల పనుల్లో వేగం పెంచి త్వరగా పూర్తిచేయాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి మంగళవారం ఆయన మునిసిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, ఇంజనీరింగ్ అధికారులతో జీపీ భవనాల పురోగతి, బీసీ సంక్షేమ రుణాలు, గ్రామీణ నీటి సరఫరా, క్రీడా ప్రాంగణాలు, హరితహారం తదితర కార్యక్రమాల అమలుపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను నిర్ణీత సమయంలో చేరుకునేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. జిల్లాలో 150 జీపీలకు భవనాలు మంజూరు కాగా ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఎక్కడైనా స్థల సమస్య ఉంటే పరిష్కరించాలని, సాధ్యం కాకపోతే అవసరమున్న మరో గ్రామానికి కేటాయించేలా ప్రతిపాదనలు సమర్పించాలని చెప్పారు.

కొనసాగుతున్న దరఖాస్తుల పరిశీలన

బీసీల్లో కుల, చేతివృత్తుల వారు రూ.లక్ష ఆర్థిక సాయం కోసం 26,451 మంది దరఖాస్తు చేసుకోగా, ఇప్పటివరకు 13,820 మందిని అర్హులుగా గుర్తించినట్లు కలెక్టర్ తెలిపారు. ఇంకా దరఖాస్తుల పరిశీలన కొనసాగుతున్నందున అర్హులెవరూ నష్టపోకుండా చూడాలని చెప్పారు. అనంతరం తాగునీటి సరఫరాలో ఎదురవుతున్న సమస్యలు, ప్రత్యామ్నాయాలపై చర్చించారు. అలాగే, హరితహారం లక్ష్యాలు, క్రీడాప్రాంగణాల నిర్మాణంపై సూచనలు చేశారు. అదనపు కలెక్టర్ స్నేహలత, అసిస్టెంట్ కలెక్టర్ రాధికాగుప్తా, జెడ్పీ సీఈఓ అప్పారావు, డీఆర్డీఓ విద్యాచందన, బీసీ సంక్షేమ అధికారి జి.జ్యోతి, పీఆర్ ఈఈ కేవీకే.శ్రీనివాస్, మిషన్ భగీరథ ఈఈలు పుష్పలత, వాణిశ్రీ, గిరిజన సంక్షేమ శాఖ ఈఈ తానాజీ పాల్గొన్నారు.

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి

ఖమ్మం అర్బన్: ప్రభుత్వ స్థలాల్లో నివాసం ఏర్పరచుకున్న వారికి జీఓ 59 ద్వారా క్రమబద్ధీకరణ అవకాశం ఉన్న నేపథ్యాన సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ గౌతమ్ సూచించారు. జిల్లా కేంద్రంలోని 55వ డివిజన్ వేణుగోపాల్ నగర్–1, 2తో పాటు నాలుగో డివిజన్‌లోని యూపీహెచ్ కాలనీ, 20వ డివిజన్ రామచంద్రయ్య నగర్‌ల్లో పర్యటించిన కలెక్టర్ దరఖాస్తుల పరిష్కారానికి చెల్లించాల్సిన నగదు, తద్వారా వచ్చే ప్రయోజనాలను వివరించారు. భూమి విలువలో కనీస ధర చెల్లిస్తే పట్టా అందుతుందని, తద్వారా ఇంటి నిర్మాణ అనుమతులు, బ్యాంకుల ద్వారా రుణాలు అందుతాయని తెలిపారు. అదనపు కలెక్టర్లు స్నేహలత ఎన్.మధుసూదన్, అసిస్టెంట్ కలెక్టర్ రాధికాగుప్తా, డీపీఓ విజయనిర్మల, జిల్లా ఉపాధికల్పనాధికారి శ్రీరాం, తహసీల్దార్ శైలజ పాల్గొన్నారు.

పోలీస్ శాఖలో పలువురికి సేవా పతకాలు

ఖమ్మంక్రైం: విధినిర్వహణలో విశిష్ట సేవలందించిన పలువురు పోలీస్ ఉద్యోగులకు ఉన్నతాధికారులు పతకాలు ప్రకటించారు. ఈ జాబితాలో ఖమ్మం కమిషనరేట్ పరిధిలోని ఉద్యగులకు స్థానం దక్కింది. ఈమేరకు ఖమ్మం వన్ టౌన్ ఎస్ఐ ఎల్.శ్రీనివాసరావు, సీఎస్‌బీలో ఎస్ఐ రాము, ఏఎస్ఐ నాగేశ్వరరావు, ఖానాపురం హవేలీ ఏఎస్ఐ వెంకటరెడ్డి, ఖమ్మం సీఏఆర్ ఏఎస్ఐ డి.సుబ్బారావుకు పతకాలు లభించాయి. అలాగే, సీఏఆర్ విభాగంలో ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ వెంకన్న, ఖమ్మం ట్రాఫిక్ విభాగంలో కానిస్టేబుల్ నాగేశ్వరరావు, ఏన్కూర్ హెడ్‌కానిస్టేబుల్ కొండయ్య, ఖమ్మం ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ మదార్, ఖమ్మం టూటౌన్ ఫింగర్ ప్రింట్ విభాగంలో విధులు నిర్వర్తిస్తున్న కానిస్టేబుల్ జమలయ్య కూడా సేవా పతకాలకు ఎంపికైన వారిలో ఉన్నారు.

డెంగీ జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి

- ఒక్క కేసు నమోదు కాకుండా కార్యాచరణ
- జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి మాలతి



చికిత్స పొందుతున్న వారితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ మాలతి

నేలకొండపల్లి: జిల్లాలో డెంగీ తదితర సీజనల్ వ్యాధులు ప్రబలకుండా యంత్రాంగం ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి మాలతి తెలిపారు. నేలకొండపల్లిలోని సీహెచ్‌సీని మంగళవారం తనిఖీ చేసిన ఆమె అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. ఆతర్వాత వైద్యులు, సిబ్బందితో సమావేశమై పలు సూచనలు చేశారు. అనంతరం డీఎంహెచ్‌ఓ విలేకరులతో మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల కట్టడికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లాలో గతేడాది 711 డెంగీ కేసులు నమోదు కాగా, ఈసారి ఒక్క కేసు నమోదు కాకుండా కార్యాచరణ రూపొందించామని చెప్పారు. ప్రజలు ఇళ్లలోనే కాకుండా పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తద్వారా దోమల వ్యాప్తిని అరికట్టవచ్చని తెలిపారు. కాగా, నేలకొండపల్లి వైద్యశాలలో మహిళ వైద్యురాలిని నియమిస్తామని డీఎంహెచ్‌ఓ వెల్లడించారు.

మోడల్ గా తీర్చిదిద్దుతాం

నేలకొండపల్లి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో అన్ని వసతులు కల్పించి మోడల్‌గా తీర్చిదిద్దుతామని వైద్య విధాన పరిషత్ ఆస్పత్రుల సూపరింటెండెంట్ బి.వెంకటేశ్వర్లు తెలిపారు. సీహెచ్‌సీని తనిఖీ చేసిన ఆయన మాట్లాడుతూ ఖాళీగా ఉన్న వైద్యులు, సిబ్బంది పోస్టులను భర్తీ చేయనున్నట్లు చెప్పారు. అలాగే, కల్లూరు, మధిర, తిరుమలాయపాలెం, నేలకొండపల్లి సీహెచ్‌సీల్లో నియామకాలు, సౌకర్యాల కల్పనపై దృష్టి సారించినట్లు వివరించారు. పోస్టుమార్టమ్ గది నిర్మాణం పూర్తయినందున ఇక నుంచి పాలేరు డివిజన్ కేసులకు ఇక్కడే పోస్టుమార్టం చేయిస్తామని తెలిపారు. కాగా, ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమణదారుల నుంచి కాపాడాలని ఆప్ నాయకుడు పసుమర్తి శ్రీనివాస్ వినతిపత్రం అందజేశారు. మండల వైద్యాధికారి కె.రాజేష్, సూపర్‌వైజర్ వీరన్న తదితరులు పాల్గొన్నారు.

నేడు సాగర్ జలాలు విడుదల

రేపటికల్లా పాలేరుకు చేరనున్న నీరు



ఇన్ టేక్‌వెల్ వద్ద పూడికతీత పనుల్లో నిమగ్నమైన సిబ్బంది

కూసుమంచి: మండలంలోని పాలేరు రిజర్వాయర్‌కు బుధవారం సాగర్ డ్యామ్ నుంచి నీటిని విడుదల చేయనున్నారు. దీంతో గురువారం ఉదయానికల్లా రిజర్వాయర్‌కు నీరు చేరుతుందని జల వనరుల శాఖ అధికారులు భావిస్తున్నారు. మంగళవారం నాటికి రిజర్వాయర్ నీటిమట్టం 11.30 అడుగులకు పడిపోగా, సాగర్ జలాలు వస్తే పెరుగుతుందని చెబుతున్నారు. వర్షాభావ పరిస్థితులతో రిజర్వాయర్ నీటిమట్టం నానాటికీ పడిపోతుండగా, తాగునీటి పథకాలకు కూడా సరఫరా అయ్యే పరిస్థితి లేదు. దీంతో జిల్లా ఉన్నతాధికారులు ప్రభుత్వానికి విన్నవించగా సాగర్ నుండి ఒక టీఎంసీ నీటిని కేటాయించింది. దీంతో బుధవారం విడుదల చేయనున్న నీరు గురువారంకల్లా చేరుతుందని, తద్వారా తాగునీటికి ఇబ్బందులు తీరతాయని చెబుతున్నారు.

శరవేగంగా పూడికతీత పనులు

పాలేరు రిజర్వాయర్ నుండి కూసుమంచి మండలంలోని 74 గ్రామాలకు తాగునీరు అందించే పాత ప్రాజెక్టు ఇన్ టేక్‌వెల్ పూడికతీత పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. మరో మూడు రోజుల్లో పనులు పూర్తయ్యే అవకాశముందని సమాచారం. ఇంతలోనే రిజర్వాయర్‌కు సాగర్ జలాలు చేరితే తాగునీటి ఇబ్బందులు తొలగనున్నాయి.

రైతులపై కాంగ్రెస్‌కు కడుపుమంట..

- రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు ఆ పార్టీ వైఖరికి నిదర్శనం
- సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య



నిరసన వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే వెంకటవీరయ్య, ప్రజాప్రతినిధులు, నాయకులు

సత్తుపల్లి: వ్యవసాయ రంగం, రైతాంగం అభివృద్ధిపై కాంగ్రెస్ పార్టీకి ఉన్న చిత్తశుద్ధి టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి వ్యాఖ్యలతో అర్థమవుతోందని సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పేర్కొన్నారు. రైతులపై ఆ పార్టీకి అంత కడుపు మంట ఎందుకో చెప్పాలని సూచించారు. వ్యవసాయ రంగానికి ఉచిత విద్యుత్ విషయమై తాజాగా రేవంత్ చేసిన వ్యాఖ్య లను నిరసిస్తూ సత్తుపల్లిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద మంగళవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు రైతులకు విద్యుత్ అందక ఇక్కట్లు ఎదుర్కొన్నారని తెలిపారు. ప్రస్తుత బీఆర్‌ఎస్ పాలనలో 24 గంటల పాటు ఉచిత విద్యుత్, రైతు బీమా, రైతుబంధు అమలుచేస్తుండడంతో రైతాంగం సంతోషంగా ఉందని చెప్పారు. అలాగే, కాళేశ్వరం తది తర ప్రాజెక్టుల నిర్మాణంతో సాగునీరు అందుతుండగా... రేవంత్‌రెడ్డి ఇవేమీ పట్టించుకోకుండా తెలంగాణ రైతులను అవమానపరిచేలా మాట్లాడడం సరి కాదన్నారు. తాజాగా ఖమ్మంలో సభలో ఆసరా పింఛన్లు రూ.4వేలకు పెంచుతామని ప్రకటించిన ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ ప్రస్తుతం కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఎందుకు అమలు చేయడం లేదో చెప్పాలని ఎమ్మెల్యే సండ్ర డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు, బీఆర్‌ఎస్ పట్టణ, మండల అధ్యక్షులు ఎస్.కే.రఫీ, యాగంటి శ్రీనుతోపాటు వనమా వాసు, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

నేడు ఖమ్మంలో మంత్రి పర్యటన

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ బుధవారం ఖమ్మంలో పర్యటించనున్నారు. ఉదయం 48, 42, 48, 50వ డివిజన్లలో పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేస్తారు. అలాగే, పూర్తయిన పనులను ప్రారంభించనున్నారు. ఆతర్వాత రఘునాథపాలెం మండలం మంచుకొండలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యాన చేపట్టే నిరసనలో పాల్గొననున్న మంత్రి పువ్వాడ.. సాయంత్రం క్యాంపు కార్యాలయంలో యువతకు లెర్నింగ్ లైసెన్సు పత్రాలు పంపిణీ చేస్తారు.

కార్మికుల సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కార్మికుల కోర్టు కేసులు, సంక్షేమం, డిపెండెంట్ తదితర సమస్యల పరిష్కారానికి పర్సనల్ విభాగం అధికారులు చొరవ చూపాలని జీఎం(ఐఆర్‌పీఎం) బి.హనుమంతరావు సూచించారు. సింగరేణి ప్రధాన కార్యాలయం నుంచి మంగళవారం ఆయన 11 ఏరియాల పర్సనల్ విభాగాల హెచ్‌ఓడీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. 11వ వేజ్‌బోర్డ్‌లో కార్మికులకు సవరించిన పే స్కేల్‌ను జూన్ నుంచే అమలు చేసేలా కృషి చేసిన సంక్షేమ, పర్సనల్, ఈపీఆర్, ఐటీ విభాగాల అధికారులను అభినందించారు. విధులకు గైర్హాజరయ్యే ఉద్యోగులకు కుటుంబసభ్యులతో కౌన్సిలింగ్ నిర్వహించాలని సూచించారు. వీసీలో జీఎం కట్టా బసవయ్య, ఏజీఎం కె.శ్రీనివాస్, ఎస్‌ఓ టూ డైరెక్టర్(పా) ఏజీ మురళీధర్ రావు, డీజీఎం అజయ్‌కుమార్, పర్సనల్ మేనేజర్లు వరప్రసాద్‌రావు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

రైస్ మిల్లులో అధికారుల తనిఖీలు

అక్రమంగా ధాన్యం తరలిస్తున్నట్లుగా ఫిర్యాదు?



రాజేశ్వరపురంలోని మిల్లులో తనిఖీ చేస్తున్న డీఎస్‌ఓ, డీఎం

నేలకొండపల్లి: మండలంలోని రాజేశ్వరపురంలో ఉన్న ఓ రైస్‌మిల్లులో మంగళవారం రాత్రి అధికారులు ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. ఈ మిల్లు నుంచి అక్రమంగా ఏపీకి ధాన్యం తరలిస్తున్నారని అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు అందినట్లు సమాచారం. దీంతో ఆయన సూచనల మేరకు జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి(డీసీఎస్‌ఓ) రాజేందర్, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్(డీఎం) సోములు తనిఖీ చేశారు. ఆ సమయంలో దాదాపు ఐదు లారీల ధాన్యం మిల్లు వద్ద ఉండగా.. బయట నుంచి మిల్లులోకి తీసుకొస్తున్నారా, మిల్లు నుంచే ఏపీకి తరలిస్తున్నారా అనే కోణంలో విచారణ చేపట్టారు. ఈమేరకు అధికారులు లారీల నంబర్లు, వివరాలు, ట్రక్ షీట్లను నిశితంగా పరిశీలించారు. మరోమారు బుధవారం పరిశీలిస్తామని, అప్పటి వరకు లారీల నుంచి ధాన్యం దించొద్దని ఆదేశించారు. తనిఖీల్లో సివిల్ సప్లయీస్ డిప్యూటీ తహసీల్దార్ ఆలస్యం మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి నిత్యకల్యాణ వేడుక మంగళవా రం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశా రు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి, నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. మంగళవారాన్ని పురస్కరించుకుని ఆంజనేయస్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

క్లుప్తంగా

పదోన్నతులు, నియామకాల ప్రక్రియ ప్రారంభించాలి



సమావేశంలో పాల్గొన్న యూఎస్‌పీసీ బాధ్యులు

ఖమ్మం సహకారనగర్: ఉపాధ్యాయుల బదిలీల కేసు పరిష్కారంలో ఆలస్యం జరుగుతున్నందున తాత్కాలికంగా బదిలీలు, పదోన్నతులు కల్పించేందుకు షెడ్యూల్ విడుదల చేయాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ(యూఎస్‌పీసీ) నాయకులు డిమాండ్ చేశారు. పాత పింఛన్ పునరుద్ధరణ ఫోరం ఆధ్వర్యాన జిల్లా స్థాయి సదస్సు ఖమ్మంలోని రిక్కాబజార్ పాఠశాలలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా యూఎస్‌పీసీ బాధ్యులు మాట్లాడుతూ సబ్జెక్టు టీచర్లు లేక విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. ఈమేరకు హైకోర్టు తుదితీర్పుకు లోబడి ఉండేలా తాత్కాలికంగా పదోన్నతులు, బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కమిటీ బాధ్యులు కె.జంగయ్య, చావ రవి, వై.అశోక్‌కుమార్, పి.నాగిరెడ్డి, ఎం.సోమయ్య, టి.లింగారెడ్డి, యు.పోచయ్య, డి.సైదులు, షౌకత్ అలీ, పిట్ల రాజయ్య, కొమ్ము రమేష్, ఎస్.యాదగిరి, ఎస్.హరికృష్ణ, వి.శ్రీనునాయక్, కె.బిక్షపతి, వై.విజయకుమార్, బి.కొండయ్య, ఎస్.మహేష్, జాడి రాజన్న, మేడి చరణ్‌దాస్, జాదవ్ వెంకట్రావు, డి.రాజనర్సు తదితరులు పాల్గొన్నారు.

అడ్‌హాక్ పదోన్నతులు కల్పించాలి

ఖమ్మం సహకారనగర్: ఉపాధ్యాయుల బదిలీల కేసు వాయిదాలు పడుతున్న నేపథ్యాన గతంలో మాదిరి అడ్‌హాక్ పదోన్నతులైనా కల్పించాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జీ.వీ.నాగమల్లేశ్వరరావు, పారుపల్లి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. తద్వారా విద్యారంగంలో సంక్షోభాన్ని నివారించాలని తెలిపారు. హైస్కూళ్లలో సబ్జెక్ట్ టీచర్ల కొరత కారణంగా బోధనకు ఆటంకం ఏర్పడుతున్న నేపథ్యాన తాత్కాలిక పద్ధతిలో పదోన్నతులు ఇచ్చేందుకు ప్రభుత్వం షెడ్యూల్ విడుదల చేయాలని వారు ఓ ప్రకటనలో కోరారు.

నేడు మాజీ ఎంపీ పొంగులేటి పర్యటన

ఖమ్మంమయూరిసెంటర్: కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి బుధవారం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నారు. ఖమ్మం, పాల్వంచ పట్టణాల్లోని పలు గ్రామాల్లో జరిగే కార్యక్రమాల్లో ఆయన పాల్గొంటారని క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ టి.దయాకర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

సీఎం కేసీఆర్‌ను అగౌరవపరిచేలా పోస్ట్

కాంగ్రెస్ కార్యకర్తపై కేసు నమోదు

కారేపల్లి: సీఎం కేసీఆర్‌ను అగౌరవపరిచేలా సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ పెట్టిన వ్యక్తిపై కారేపల్లి పోలీసు స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదైంది. మండలంలోని మాణిక్యారానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త భూక్యా రాంబాబు 'మాణిక్యారం గ్రామ పంచాయతీ' వాట్సప్ గ్రూప్‌లో సీఎం కేసీఆర్‌ను అగౌరవపరుస్తూ పోస్టు చేశాడు. ఈ విషయమై బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెద్దబోయిన ఉమాశంకర్ చేసిన ఫిర్యాదుతో రాంబాబుపై కేసు నమోదు చేసినట్లు కారేపల్లి ఎస్‌ఐ పుష్పాల రామారావు తెలిపారు. కాగా, వ్యక్తిగతంగా ఎవరినైనా దూషించినా, ఇతరుల మనోభావాలను కించపరిచేలా పోస్టులు చేసినా చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

సత్తుపల్లిటౌన్: ఊరికి వెళ్లి వచ్చే సరికి దొంగలు రూ.1.50 లక్షల సొత్తు, నగదు అపహరించిన ఘటన మంగళవారం వెలుగు చూసింది. సత్తుపల్లి జవహర్‌నగర్‌లో నివాసముంటున్న శ్రీకృష్ణ మందిరం పూజారి లక్ష్మాచార్యులు కుటుంబ సభ్యులతో కలిసి నాలుగురోజుల క్రితం ఊరికి వెళ్లారు. సోమవారం అర్ధరాత్రి వచ్చే సరికి తలుపులు, తాళం పగులగొట్టి ఉండడంతో లోపల చూడగా బీరువా తలుపులు కూడా తీసి ఉన్నాయి. దీంతో పరిశీలించగా సుమారు రూ.1.50 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలు, రూ.20వేల నగదు చోరీ జరిగినట్లు గుర్తించిన ఆయన మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	7,800	6,100
మిర్చి	19,700	13,500
ఏసీ మిర్చి	24,000	18,500
మిర్చి తాలు	13,000	8,000
పత్తి	6,750	5,000

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.12,623

కాలుష్యం కనిష్టస్థాయికి..

నెట్‌జీరో దిశగా బీపీఎల్ అడుగులు

- ఐటీసీలో గణనీయంగా తగ్గిన బొగ్గు వాడకం
- ప్లాంట్ వ్యర్థాల నుంచి ఇంధనం తయారీ
- ప్రత్యామ్నాయంగా విద్యుత్ వినియోగం కూడా..



ఇటీవల అందుబాటులోకి వచ్చిన అత్యాధునిక బాయిలర్

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: లాభాల్లో దూసుకెళ్తూ విస్తరణ బాట పట్టిన భద్రాచలం పేపర్ బోర్డు యాజమాన్యం మరో రికార్డు సాధించే దిశగా తన వంతు ప్రయత్నాలను ముమ్మరం చేస్తోంది. పేపర్ బోర్డు ప్లాంట్ నుంచి వెలువడే కాలుష్యాన్ని పూర్తి స్థాయిలో నియంత్రించేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తోంది.

ఉత్పత్తి పెరిగినా..

పేపర్ తయారీకి అవసరమైన పల్ప్ ఉత్పత్తి చేయాలంటే కలపను వేడి నీటిలో గంటల తరబడి మరిగించాల్సి ఉంటుంది. ఇందుకు భారీస్థాయిలో నీరు, బొగ్గు అవసరం. అప్పటి ఉమ్మడి ఖమ్మం జిల్లాలో విస్తారంగా అడవులు, సింగరేణి బొగ్గు గనులు ఉండటంతో భద్రాచలం దగ్గర గోదావరి తీరం వెంట ప్లాంట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇందుకోసం సారపాకలో 507 ఎకరాలు పేపర్ పరిశ్రమకు కేటాయించగా 1979లో ఉత్పత్తి ప్రారంభమైంది. ఆ రోజుల్లో సాలీనా 80 వేల టన్నుల పల్ప్ తయారీ లక్ష్యంగా ఉండేది. ఇందుకు గాను ఆరు లక్షల లీటర్ల నీటిని ఉపయోగించుకునేందుకు అనుమతి ఇచ్చారు. నీటిని మరిగించేందుకు సింగరేణిబొగ్గు ఒక్కటే ఆధారం. ప్రస్తుతం ప్లాంట్ వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 7.5 లక్షల టన్నులకు చేరినా నీటి వినియోగం పెరగకపోగా, బొగ్గు వినియోగం ఏకంగా 40 శాతానికే పరిమితమైంది.

బొగ్గు బదులు లిగ్నిన్..

పేపర్ పల్ప్ తయారు చేసే క్రమంలో కర్రలను పెద్ద బాయిలర్లలో అధిక ఉష్ణోగ్రతల దగ్గర వేడి చేస్తారు. ఈ క్రమంలో పేపర్ తయారీకి అవసరమైన పల్ప్ పైభాగంలోకి చేరుకుంటుంది. లిగ్నిన్ అనే వ్యర్థ పదార్థం అడుగు భాగానికి చేరుతుంది. గతంలో ఈ లిగ్నిన్‌ను శుభ్రపరిచేందుకు క్లోరినేషన్ చేసేవారు. దీంతో జల కాలుష్యం ఎక్కువగా ఉండేది. లైమ్‌క్లిన్ అధికంగా వచ్చేది. ఫలితంగా గోదావరి జలాలు కలుషితమయ్యే ప్రమాదం ఎక్కువగా ఉండేది. కానీ ప్రస్తుతం అడుగు భాగానికి చేరుకున్న లిగ్నిన్‌ను వ్యర్థ పదార్థంగా వదిలేయడం లేదు. దీనికి మండే స్వభావం ఉండడంతో రీసైక్లింగ్ చేసేలా ప్లాంట్‌లో మార్పులు చేశారు. అడుగు భాగానికి చేరిన లిగ్నిన్ నుంచి నీటిని పూర్తిగా వేరు చేస్తున్నారు. దీంతో లిగ్నిన్ ముడి ఇంధనంగా (పిడకలు) మారుతోంది. ప్లాంట్‌లో బాయిలర్లను వేడెక్కించేందుకు బొగ్గుకు బదులుగా 30 శాతం వరకు లిగ్నిన్‌ను ఉపయోగిస్తున్నారు.

బూడిద బాధ పోయింది

ఒకప్పుడు ఈ ప్లాంట్ నుంచి ఏడాదికి 30 వేల టన్నుల బూడిద వెలువడేది. ఈ బూడిద కోసం స్థానికంగా యాష్ డంపింగ్ యార్డులు ఏర్పాటు చేయగా ఇటుకలు, సిమెంట్ పరిశ్రమలకు పంపేవారు. కానీ ఇప్పుడు బొగ్గు వినియోగం తగ్గడంతో కేవలం సిమెంట్ పరిశ్రమలకే బూడిద తరలుతోంది. మారుతున్న పరిస్థితులకు తగ్గట్టుగా ఆధునిక టెక్నాలజీని ఉపయోగించడంలో భద్రాచలం పేపర్ బోర్డు ముందుంది. ఫలితంగా నీటి వాడకాన్ని పెంచకుండా, బొగ్గు వినియోగాన్ని సగానికి పైగా తగ్గించి కూడా ఉత్పత్తి సామర్థ్యాన్ని ఆరు రెట్లు పెంచుకోగలిగింది. ప్లాంట్‌లో బొగ్గు వినియోగం తగ్గడానికి ప్రధాన కారణం పవన విద్యుత్‌తో పాటు ఓజోనైజేషన్, సీఎఫ్‌టీసీ టెక్నాలజీలు ఎంతగానో ఉపయోగపడ్డాయని ప్లాంట్ వర్గాలు అంటున్నాయి. ఇదే స్ఫూర్తితో ముందుకు సాగుతూ రాబోయే రోజుల్లో కాలుష్య నియంత్రణ విషయంలో నెట్ జీరో సాధించాలనేది సంస్థ లక్ష్యంగా ఉంది.

పవర్ ఎక్స్ఛేంజ్..

భద్రాచలం పేపర్ బోర్డుకు మాతృ సంస్థగా ఇండియన్ టొబాకో కార్పొరేషన్ వ్యవహరిస్తోంది. ఐటీసీకి ఏపీలోని అనంతపురం జిల్లాలో 50 మెగావాట్ల సామర్థ్యం కలిగిన పవన విద్యుత్ ప్లాంట్ ఉంది. అక్కడ ఉత్పత్తి చేసిన విద్యుత్‌ను సెంట్రల్ పవర్ గ్రిడ్‌కు ఇస్తూ దానికి బదులుగా స్థానిక గ్రిడ్ నుంచి ప్లాంట్‌కు అంతే మొత్తంలో విద్యుత్‌ను తీసుకుంటోంది. ఫలితంగా ప్లాంట్‌లో బొగ్గు వినియోగం 40 శాతం వరకు తగ్గిపోయింది. బొగ్గు స్థానంలో విద్యుత్, లిగ్నిన్‌ను ఉపయోగించడంతో గతంతో పోలిస్తే వాయు కాలుష్య తీవ్రత గణనీయంగా తగ్గింది. ఒకప్పుడు ప్లాంట్ చుట్టుపక్కల గ్రామాలపై బూడిద పొరలు పేరుకుపోయేవి. ఇప్పుడు చాలా వరకు తగ్గింది. మరోవైపు వ్యర్థంగా మిగిలిపోయిన లిగ్నిన్ కుళ్లిపోయి ప్లాంట్ పరిసర ప్రాంతాల్లో తీవ్రమైన దుర్గంధం వ్యాపించేది. భద్రాచలం వెళ్లే భక్తులు కళ్లు మూసుకుని ప్రయాణిస్తున్నా... వాసన కారణంగా సారపాక వచ్చినట్టు తెలిసేది. కానీ ఇప్పుడా సమస్య దూరమైంది. ప్లాంట్‌లో కొద్ది ప్రాంతానికే దుర్వాసన పరిమితమైందని ఇక్కడ పని చేసే కార్మికులు అంటున్నారు.

చిన్నారులకు కన్నీటి వీడ్కోలు

- తండ్రి చేతిలో హతమైన పిల్లలకు అంత్యక్రియలు నిర్వహించిన నానమ్మ
- నిందితుడిని ఎన్‌కౌంటర్ చేయాలని స్థానికుల ఆందోళన



మృతదేహాల వద్ద రోదిస్తున్న తల్లి ఏసుమణి



అంత్యక్రియలు నిర్వహించేందుకు వెళ్తున్న రాధమ్మ, బంధువులు



ఆందోళనకు దిగిన వారికి నచ్చచెబుతున్న ఎర్రుపాలెం ఎస్సై సురేష్

మధిర: కన్నతండ్రే కసాయిగా మారి ఇద్దరు పిల్లల గొంతు నులిమి హత్య చేసిన ఘటన మండలంలోని రాయపట్నంలో సోమవారం సాయంత్రం జరిగిన విషయం విదితమే. ఈమేరకు రాయపట్నంకు చెందిన పార్శపు శివరామ గోపాలరావు తన పిల్లలు రామకృష్ణ, ఆరాధ్యను గొంతు నులిమి హత్య చేయగా... మృతదేహాలను సోమవారం రాత్రి మధిర ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీ గదిలో భద్రపరిచారు. మంగళవారం ఉదయం పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించగా తల్లి ఏసుమణి చిన్నారులను పట్టుకుని రోదించిన తీరు అందరినీ కంటతడి పెట్టించింది. కాగా, చిన్నారుల మృతదేహాల వద్ద జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు నివాళులర్పించి బంధువులను పరామర్శించారు. అనంతరం మృతదేహాలను ఆర్కే ఫౌండేషన్ నిర్వాహకులు దొర్నాల రామకృష్ణ, జ్యోతి, సుదర్శన్ రాయపట్నం తరలించగా, రామకృష్ణ, ఆరాధ్య మృతదేహాలకు వారి నాయనమ్మ రాధమ్మ అంత్యక్రియలు నిర్వహించారు.

పోలీసుల అదుపులో నిందితుడు?

కన్నబిడ్డలను హత్య చేసి పారిపోయిన గోపాలరావును పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. అయితే, ఈవిషయాన్ని పోలీసులు ధృవీకరించకపోయినా సామాజిక మాధ్యమాల్లో ప్రచారం జరిగింది. దీంతో ఏసుమణి బంధువులు, రాయపట్నం వాసులు పెద్దసంఖ్యలో టౌన్ పోలీసు స్టేషన్‌కు వద్దకు చేరుకున్నారు. నిందితుడిని తమకు అప్పగించాలని, లేదంటే ఎన్‌కౌంటర్ చేయాలనే డిమాండ్‌తో నినాదాలు చేశారు. ఈమేరకు ఎర్రుపాలెం ఎస్సై సురేష్ వారికి నచ్చచెప్పి నిందితుడికి చట్టప్రకారం శిక్ష పడేలా చూస్తామని తెలిపారు. దీంతో మహిళలు ఆందోళన విరమించి వెళ్లిపోయారు.

నమ్మబలికి తీసుకెళ్లి...

పిల్లలు రామకృష్ణ, ఆరాధ్య పాఠశాలలో ఉండగా గోపాల్‌రావు వెళ్లి వారితో తొలుత ప్రేమగా మాట్లాడినట్లు సమాచారం. ఆతర్వాత వారిని ఇంటికి తీసుకెళ్తానని నమ్మబలడంతో తండ్రి కుట్ర తెలియని చిన్నారులిద్దరూ వెంట వెళ్లినట్లు సమాచారం. అప్పటికే మద్యం మత్తులో ఉన్న గోపాలరావు వారి గొంతు నులిమి హత్య చేశాక మూట కట్టి పారిపోయాడు. అయితే, కొన్నాళ్లుగా తల్లితో ఉంటున్న వారు తండ్రిని చూడగానే మళ్లీ అంతా కలిసిపోతామని ఆశ పడగా.. చివరకు ఆయన చేతిలో హతం కావడం స్థానికంగా విషాదాన్ని నింపింది. కాగా, నిందితుడు పోలీసుల అదుపులో ఉన్నట్లు తెలుస్తుండగా, పోలీసులు మాత్రం ఈ విషయాన్ని ధృవీకరించలేదు.

నేరాల నియంత్రణకే పోలీసుల కార్డన్ సెర్చ్

ఏసీపీలు రెహమాన్, రామానుజం



వైరా : శాంతినగర్‌లో స్థానికులతో మాట్లాడుతున్న వైరా ఏసీపీ రహమాన్



సత్తుపల్లి టౌన్: సీజ్ చేసిన వాహనాలను పరిశీలిస్తున్న ఏసీపీ రామానుజం, సీఐలు

వైరా: గ్రామాల్లో నేరాల నియంత్రణ, సంఘ విద్రోహ శక్తులను అరికట్టేందుకు కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్నామని వైరా ఏసీపీ ఎం.ఏ.రెహమాన్ వెల్లడించారు. వైరా మున్సిపాలిటీ పరిధి శాంతినగర్ ఎస్టీ కాలనీలో మంగళవారం ఉదయం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ రెహమాన్ మాట్లాడుతూ యువత గంజాయి, మద్యం వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే ప్రమాదాలకు గురై కుటుంబాలు రోడ్డున పడతాయని, డ్రంకెన్ డ్రైవ్ పరీక్షల్లో పట్టుబడితే జరిమానాతో పాటు జైలు శిక్ష తప్పదని చెప్పారు. అనంతరం సరైన పత్రాలు లేని పది ద్విచక్రవాహనాలు, ఓ బొలేరోతో పాటు బెల్ట్ షాపుల్లో రూ.5వేల విలువైన మద్యం స్వాధీనం చేసుకున్నారు. తనిఖీల్లో వైరా సీఐ టి.సురేష్, ఎస్సైలు మేడా ప్రసాద్, జె.శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

సంఘ విద్రోహ శక్తులతో జాగ్రత్త

సత్తుపల్లిటౌన్: చట్టవ్యతిరేక కార్యకలాపాలకు చేసే సంఘ విద్రోహ శక్తులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కల్లూరు ఏసీపీ రామానుజం సూచించారు. పట్టణంలోని విరాట్‌నగర్‌లో మంగళవారం కార్డెన్‌సెర్చ్ నిర్వహించగా ఇంటింటికీ వెళ్లి తనిఖీ చేశారు. వాహన పత్రాలు లేని 40 ద్విచక్రవాహనాలను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం ఏసీపీ మాట్లాడుతూ అపరిచితులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. తనిఖీల్లో సీఐలు టి.కరుణాకర్, హన్మాక్, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన కారు

ఒకరి మృతి, ఇద్దరికి గాయాలు



రాజేష్ (ఫైల్)

ఖమ్మంరూరల్: ప్రేమించి పెళ్లి చేసుకున్న ఆయన కొద్దిపాటి సంపాదనతో అటు తల్లిదండ్రులు, ఇటు భార్యాబిడ్డను పోషించుకుంటున్నాడు. ఉన్నంతలో హాయిగా సాగుతున్న ఆయన జీవితాన్ని కారు ప్రమాదం రూపంలో బలితీసుకుంది. మండలంలోని ఆరెంపుల వద్ద జరిగిన ప్రమాదం వివరాలు పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం ఇలా ఉన్నాయి. తిరుమలాయపాలెం మండలం సుబ్లేడుకు చెందిన భట్టి రాజేష్(25) సీపీఎం నాయకుడు పోతినేని సుదర్శన్ కారుడ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈక్రమంలో మంగళవారం ఉదయం ఆయన ద్విచక్రవాహనంపై ఖమ్మం బయలుదేరాడు. మార్గమధ్యలో ఆరెంపుల వద్ద ఖమ్మం వైపు నుండి వరంగల్ వైపు అతివేగంగా వెళ్తున్న కారు ఆయన ద్విచక్రవాహనంతో పాటు ఇంకో వాహనాన్ని ఢీకొట్టగా రాజేష్ తీవ్ర గాయాలయ్యాయి. దీంతో 108లో ఖమ్మం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే రాజేష్ మృతి చెందాడు. అలాగే, ఇంకో వాహనంపై ఉన్న ఇద్దరు స్వల్పంగా గాయపడ్డారు. కాగా, రాజేష్ మృతదేహం వద్ద సీపీఎం నాయకులు నివాళులర్పించగా, ఆయన భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకటకృష్ణ తెలిపారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి

ఖమ్మం అర్బన్: కారు ఢీకొట్టిన ఘటనలో రోడ్డు దాటుతున్న ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. ఖమ్మం అగ్రహారం న్యూ కాలనీకి చెందిన పుట్టబంతి పుల్లయ్య (45) తన వాహనంపై మంగళవారం వైరా రోడ్డులో డివైడర్ దాటుతుండగా వైరా వైపు నుంచి వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన పుల్లయ్యను ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అలాగే, పుల్లయ్య వాహనంపై ఉన్న పరశురాం తీవ్రంగా గాయపడ్డారు. ఈమేరకు బాధిత కుటుంబం ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఖమ్మం అర్బన్ పోలీసులు తెలిపారు.

బస్సు క్లీనర్‌పై దాడి, కులం పేరుతో దూషణ

అట్రాసిటీ కేసు నమోదు చేసిన పోలీసులు



రాస్తారోకో చేస్తున్న దళిత సంఘాల నాయకులు

తిరుమలాయపాలెం: రహదారిపై అడ్డుగా ఉన్న ట్రాక్టర్ తీయాలని కోరినందుకు పాఠశాల బస్సు క్లీనర్‌ను కులం పేరుతో దూషించడమే కాక దాడికి పాల్పడ్డ ఘటనపై మంగళవారం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు... మండలంలోని పిండిప్రోలుకు చెందిన పగిడిపల్లి బాబు దమ్మాయిగూడెంలోని ప్రైవేట్ పాఠశాల బస్సు క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. పిండిప్రోలు వద్ద పిల్లలను ఎక్కించుకుని వెళ్తుండగా గ్రామానికి చెందిన తాత మనోజ్‌కుమార్ ట్రాక్టర్ అడ్డుగా ఉండడంతో పక్కకు తీయాలని కోరాడు. దీంతో కోపోద్రిక్తుడైన మనోజ్ 'నా స్థలంలో నేను పెట్టుకుంటా, నువ్వు ఎవడ్రా' అంటూ కులం పేరుతో దూషించి దాడికి పాల్పడ్డాడు. దీంతో బాధితుడు ఫిర్యాదు చేయగా ఆయనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

దళిత సంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకో

పిండిప్రోలుకు చెందిన మనోజ్‌కుమార్ రాజకీయ అండతో క్లీనర్‌ను కులం పేరుతో దూషించి దాడికి పాల్పడినందున వెంటనే అరెస్ట్ చేయాలని దళిత సంఘాల నాయకులు తిరుమలాయపాలెం పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన నిర్వహించారు. పోలీసులు స్పందించకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు, యూనిటీ ఆఫ్ మాల, కేవీపీఎస్ నాయకులు వీరభద్రం, గుమ్మడి కనకరాజు, రామకృష్ణ, నాగటి సురేష్, పిచ్చయ్య పప్పుల నర్సింహారావు, సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

పిచ్చికుక్క దాడిలో ఆరుగురికి తీవ్ర గాయాలు

నేలకొండపల్లి: మండలంలోని శంకరగిరితండా గ్రామంలో పిచ్చికుక్క స్వైర విహారం చేసి పలువురిని తీవ్రంగా గాయపరిచింది. స్థానికుల కథనం ప్రకారం... శంకరగిరితండాలో మంగళవారం ఓ పిచ్చి కుక్క రహదారి వెంట కనిపించిన వారినల్లా కరిచింది. దీంతో గ్రామానికి చెందిన జర్పుల సేవియా, మాలోత్ బిక్షం, వడ్తియా వెంకన్న, జర్పుల బిక్యా, తేజావత్ వీరయ్య, తేజావత్ బుజ్జి తీవ్రంగా గాయపడ్డారు. చివరకు స్థానిక యువత కుక్కను తరిమికొట్టి చంపేశారు. అనంతరం క్షతగాత్రులను బంధువులు చికిత్స నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

గంజాయి రవాణా కేసులో 20 ఏళ్ల జైలుశిక్ష

ఖమ్మంలీగల్: గంజాయి రవాణా చేస్తూ పట్టుబడిన తిరుమలాయపాలెం మండలం కుక్కలతండాకు చెందిన బానోతు రవి, బానోతు డుబ్లాకు ఇరవై ఏళ్ల జైలుశిక్షతోపాటు రూ.లక్ష జరిమానా విధించారు. ఈమేరకు ఖమ్మం ప్రత్యేక సెషన్స్ న్యాయమూర్తి కె.ఉమాదేవి మంగళవారం వెల్లడించిన తీర్పు వివరాలిలా ఉన్నాయి. 2019 ఫిబ్రవరి 28న ఖమ్మం స్టేషన్ రోడ్డులోని షాదీఖానా ఎదుట పోలీసులు, ఎక్సైజ్ అధికారులు తనిఖీలు చేపట్టగా ద్విచక్ర వాహనంపై వెళ్తున్న రవి, డుబ్లా పారిపోయేందుకు యత్నించారు. వీరిని అదుపులోకి తీసుకుని సోదా చేయగా పది కేజీల గంజాయి లభించింది. దీంతో నిందితులపై కోర్టులో చార్జీషీటు దాఖలు చేయగా విచారణలో నేరం రుజువు కావడంతో ఇరవై ఏళ్ల జైలుశిక్షతోపాటు రూ.లక్ష జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పుచెప్పారు. జరిమానా చెల్లించకపోతే ఏడాది అదనంగా జైలుశిక్ష అనుభవించాలని పేర్కొన్నారు. కాగా, రెండో నిందితుడు కోర్టుకు హాజరు కాకపోవడంతో ఆయనపై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేశారు. ప్రాసిక్యూషన్ తరఫున కొత్తా వెంకటేశ్వరరావు, హరీందర్‌రెడ్డి వాదించగా, సిబ్బంది టి.మారేశ్వరరావు, వెంకటేశ్వర్లు, అయూబ్ సహకరించారు.

ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య

యువతి బంధువుల దాడితో మనస్తాపం?



రమేష్ (ఫైల్)

కూసుమంచి: మండలంలోని గట్టుసింగారం గ్రామానికి చెందిన బొల్లం రమేష్ (21) మంగళవారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అదే గ్రామంలో ఉంటున్న తన అమ్మమ్మ ఇంటికి వెళ్లిన ఆయన ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకున్నాడు. మధ్యాహ్నం ఆమె వచ్చేసరికి గడియ పెట్టి ఉండడంతో కిటికీలో నుండి చూడగా రమేష్ ఉరి వేసుకుని ఉండడంతో స్థానికులతో కలిసి తలుపులు పగులగొట్టి చూడగా అప్పటికే మృతి చెందాడు. కాగా, రమేష్‌కు అదే గ్రామంలోని ఓ యువతితో ప్రేమ వ్యవహారం ఉండగా, ఆమె బంధువులు ఇటీవల ఇంటిపై దాడి చేసినట్లు సమాచారం. ఈ ఘటనతోనే మనస్తాపానికి గురైన రమేష్ ఆత్మహత్యకు పాల్పడ్డాడని ఆయన తండ్రి లింగయ్య చేసిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమేష్‌కుమార్ తెలిపారు.

మనస్తాపంతో వ్యక్తి...

ఇల్లెందు: పట్టణంలోని జేకే.కాలనీ వాసి ఎండీ ఖాసీం (45) ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఏఎస్‌ఐ శ్రీనివాస్ మంగళవారం కేసు నమోదు చేశారు. కొంత కాలంగా ఖాసీం చెడు అలవాట్లకు బానిసవడంతో ఆరోగ్యం క్షీణించింది. దీంతో మనస్తాపం చెందిన ఆయన ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

భార్యను హత్య చేసిన భర్త

మృతురాలి స్వస్థలం జిల్లాలోని మధిర



దుర్గాభవాని (ఫైల్)

మైలవరం: కుటుంబ కలహాల నేపథ్యాన భార్యను భర్త అతికిరాతకంగా హతమార్చిన ఘటన ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా మైలవరంలో మంగళవారం చోటుచేసుకుంది. ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. ఖమ్మం జిల్లా మధిరకు చెందిన పెనుముక్కల మధుమురళి, దుర్గాభవాని(21) భార్యాభర్తలు. వీరికి ఆరేళ్ల వర్షిత్, ఏడాదిన్నర కుమార్తె జెస్సీ ఉన్నారు. ఏడాది క్రితం వీరు మైలవరం వచ్చి రామకృష్ణ కాలనీలో అద్దెకు ఉంటుండగా మధుమురళి టైల్స్ పనికి వెళ్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అయితే, మధుకి ఇటీవల భార్యపై అనుమానం పెరగడంతో మనస్పర్థలువచ్చాయి. ఈ క్రమంలోనే మంగళవారం మాటామాటా పెరిగి దుర్గాభవాని మెడపై ఆయన కత్తితో దాడి చేశాడు. దీంతో తీవ్ర రక్తస్రావం అవుతుండగా ఆమె కేకలు వేస్తూ బయటకు పరుగులు తీస్తూ గేట్ వద్ద కుప్పకూలింది. స్థానికులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు చేరుకుని మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించడంతో పాటు మధుమురళిని అదుపులోకి తీసుకున్నారు.

చేపల దొంగలుగా భావించి ఇద్దరిపై దాడి, జరిమానా

నేలకొండపల్లి: చెరువులో చేపల దొంగతనానికి వచ్చారని భావించి ఇద్దరు యువకులను కాపలాదారులు చితకబాది రాత్రంతా నిర్బంధించడమే కాక పంచాయితీ పెట్టి జరిమానా కట్టించారు. మండలంలోని చెరువుమాధారం చెరువులో ఇటీవల చేపల దొంగతనాలు జరుగుతుండగా నిఘా ఏర్పాటు చేశారు. అయితే, మంగాపురంతండాకు చెందిన ఇద్దరు యువకులు సోమవారం రాత్రి చెరువు కట్టపై కనిపించడంతో కాపలాదారులు వారిని చితకబాదడమే కాక రాత్రంతా నిర్బంధించారు. ఇక మంగళవారం చెరువుమాధారం, మంగాపురంతండా గ్రామ పెద్దలు సమావేశమై సదరు యువకులకు రూ.10 వేల జరిమానా విధించారు. అలాగే, చేపల చోరీకి వస్తే రూ.3 లక్షలు జరిమానా కడుతామంటూ బాండ్ పేపర్‌పై సంతకాలు చేయించుకున్నారు. కాగా, సదరు యువకులు మాత్రం చెరువు కట్టపైకి మామూలుగానే వెళ్లగా ఇలా చేయడంపై పలువురు అభ్యంతరం వ్యక్తం చేశారు. కాపలాదారుల దాడిలో తీవ్రంగా గాయపడిన సదరు యువకులు ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నట్లు సమాచారం.

మార్గదర్శిలో 'నల్ల' ఇంధనం!

▶ మొదటి పేజీ తరువాయి

ఈ సమాచారాన్ని అందించాల్సి ఉంటుంది. డిపాజిట్‌దారులు లిఖితపూర్వకంగా తెలిపే వివరాలను సీఐడీ అధికారులు మరోసారి క్షుణ్నంగా పరిశీలించి వాస్తవికతను నిగ్గు తేలుస్తారు. ఆర్బీఐ, కేంద్ర పరోక్ష పన్నుల బోర్డు నిబంధనలను ఎందుకు పాటించలేదు? అనే కోణాల్లో విచారణను చేయనున్నారు. తద్వారా నల్లధనం వ్యవహారాలపై ఒక నిర్ధారణకు వచ్చి తదుపరి చర్యలు చేపడతారు.

మూసివేసిన చిట్టీల నిర్వహణకు ప్రత్యేక అధికారి!

కేంద్ర చిట్‌ఫండ్స్ చట్టాన్ని ఉల్లంఘించినందున మార్గదర్శి చిట్‌ఫండ్స్ సంస్థకు చెందిన 23 చిట్టీ గ్రూపులను మూసివేయాలని స్టాంపులు–రిజిస్ట్రేషన్ల శాఖ ఇప్పటికే ఆదేశించింది. ఆ మేరకు చిట్టీ గ్రూపుల మూసివేత దాదాపు పూర్తయ్యింది. మరిన్ని గ్రూపులను మూసివేసే దిశగా అధికారులు చర్యలు వేగవంతం చేశారు. ఈమేరకు ఇప్పటికే గుర్తించిన అక్రమాలతో నివేదికను రూపొందిస్తున్నారు. మూసివేసిన చిట్టీల నిర్వహణ పర్యవేక్షణ కోసం ప్రత్యేకంగా ఒక అధీకృత అధికారిని నియమించడానికి సన్నద్ధమవుతున్నారు. మూసివేసిన చిట్టీల గ్రూపుల్లోని చందాదారులు మార్గదర్శి చిట్‌ఫండ్స్ బ్రాంచి మేనేజర్లకు చందాలు చెల్లించాల్సిన అవసరం లేదు. ఇప్పటికే చిట్టీ పాట పాడిన చందాదారులు మిగిలిన వాయిదాలను చెల్లించాలి. మూసివేసిన చిట్టీ గ్రూపుల చందాదారులకు వారి మొత్తాన్ని తిరిగి చెల్లించే ప్రక్రియ పర్యవేక్షణకు అధీకృత అధికారిని నియమిస్తూ త్వరలో నిర్ణయం తీసుకోనున్నారు.

ఉత్తమ సేవలందించిన ఫైర్ సిబ్బందికి పతకాలు

సాక్షి, హైదరాబాద్: ఉత్తమ సేవలందించిన అగ్నిమాపక శాఖ సిబ్బందికి రాష్ట్ర ప్రభుత్వ అవార్డులు దక్కాయి. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి ఏటా ఇస్తున్న పోలీస్ సేవాపతకాల్లో భాగంగా శౌర్యపతకం, మహోన్నత సేవాపతకం, ఉత్తమ సేవాపతకం, కఠినసేవా పతకం, సేవా పతకం కేటగిరీల్లో ఉత్తమ పనితీరు ప్రదర్శించిన సిబ్బంది జాబితాను రాష్ట్ర హోంశాఖ ముఖ్యకార్యదర్శి జితేందర్ విడుదల చేశారు. డెక్కన్ మాల్‌లో అగ్నిప్రమాద సమయంలో ధైర్యసాహసాలతో పనిచేసిన ఫైర్ సిబ్బందిలో హైదరాబాద్ రీజనల్ ఫైర్ ఆఫీసర్ వి.పాపయ్య, సికింద్రాబాద్ ఫైర్‌స్టేషన్ లీడింగ్ ఫైర్‌మేన్ కె.సత్యనారాయణ, డ్రైవర్ ఆపరేటర్లు జె.నర్సింగ్‌రావు, పి.శ్రీధర్‌కు శౌర్యపతకాలు వచ్చాయి. పోలీస్ శాఖలోని వివిధ విభాగాల అధికారులు, సిబ్బందికి సైతం అవార్డులు దక్కాయి. ఆ జాబితాను వెల్లడించలేదు.

ప్రేమికులపై పోలీస్‌స్టేషన్‌లోనే దాడి

రక్షణ కోసం ఎస్పీ కార్యాలయానికి పరుగులు

- ప్రేమ పెళ్లి చేసుకున్న జంటపై యువతి కుటుంబసభ్యుల ఆగ్రహం
- జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో ఘటన



గద్వాల క్రైం: పెద్దలను ఎదిరించి ప్రేమ పెళ్లి చేసుకున్న ఓ జంటపై యువతి కుటుంబీకులు పోలీస్‌స్టేషన్‌లోనే దాడికి పాల్పడ్డ ఘటన జోగుళాంబ గద్వాల జిల్లాకేంద్రంలో మంగళవారం చోటుచేసుకుంది. గద్వాలకు చెందిన ప్రశాంత్, మండలంలోని పూడూరుకు చెందిన శిరీష ఐదేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. ఇరువురి ఇళ్లలో పెద్దలను ఒప్పించి పెళ్లి చేసుకోవాలనుకున్నారు. ఈ క్రమంలో ప్రశాంత్ తల్లిదండ్రులు రెండు నెలల క్రితం ఇద్దరికీ వివాహం చేద్దామని యువతి తల్లిదండ్రులతో మాట్లాడగా.. ఇద్దరి కులాలు వేరు కావడంతో అభ్యంతరం చెప్పారు. దాంతో మేజర్లయిన ప్రేమికులు ఈ నెల 8న ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయారు. 9న కర్నూలు జిల్లా పాలబుగ్గ సమీపంలోని ఆలయంలో పెళ్లి చేసుకున్నారు. అనంతరం ఇంటికి వచ్చేందుకు, తమ ప్రాణాలకు రక్షణ కల్పించాలంటూ గద్వాల రూరల్ పోలీస్‌స్టేషన్‌కు మంగళవారం చేరుకున్నారు.

పోలీస్‌స్టేషన్‌లో ఫర్నిచర్ ధ్వంసం

పోలీసులు ఇరువురి కుటుంబసభ్యులను స్టేషన్‌కు పిలిపించి నచ్చజెప్పారు. అయితే యువతి కుటుంబసభ్యులు బలవంతంగా ఆమెను లాక్కెళ్లే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో తోపులాట జరగ్గా.. ఆమె కుటుంబసభ్యులు పోలీస్‌స్టేషన్‌లోని ఫర్నిచర్ ధ్వంసం చేసి యువకుడి కుటుంబ సభ్యులపై దాడికి పాల్పడ్డారు. పోలీసు సిబ్బంది అడ్డుకోగా.. వెంటనే రక్షణ కోసం సమీపంలోని ఎస్పీ కార్యాలయానికి రోడ్డు వెంట ఆ ప్రేమజంట పరుగులు తీసింది. ఎస్పీ సృజన వద్దకు వెళ్లి జరిగిన విషయం వివరించారు. వెంటనే ఎస్పీ ఆ ఇద్దరూ మేజర్లు కావడంతో వారికి రక్షణ కల్పించే బాధ్యత పోలీస్‌శాఖపై ఉందన్నారు. భవిష్యత్‌లో వారిపై దాడి చేయడం, అవమానపర్చడం, విడదీసే ప్రయత్నం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం ఇరువురి కుటుంబ సభ్యులను పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి కౌన్సెలింగ్ ఇప్పించారు. పోలీస్‌స్టేషన్‌లో జరిగిన ఘటనపై చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు.

పైసల్లేక.. పనులు చేయలేక రాజీనామా

- చిన్నాపూర్ సర్పంచ్ లతాశ్రీ ఆవేదన

బుగ్గారం(ధర్మపురి): 'ఊరు బాగుపడాలని తెలిసినవారి దగ్గర అప్పు తెచ్చి అభివృద్ధి పనులు పూర్తి చేయించినం.. 12 నెలలైనా బిల్లులు మంజూరు కావట్లే.. ఖాతాలో నయాపైసా లేదు.. సిబ్బందికి వేతనాలు ఇవ్వలేకపోతున్నం.. అందుకే సర్పంచ్ పదవికి రాజీనామా చేస్తున్న..' అని జగిత్యాల జిల్లా బుగ్గారం మండలం చిన్నాపూర్ గ్రామ సర్పంచ్ దమ్మ లతాశ్రీ ప్రకటించారు. వానాకాలం వచ్చినా పారిశుధ్య పనులు చేపట్టే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆమె మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ బ్లీచింగ్ పౌడర్ కొనుగోలు చేయక, వీధి దీపాలు ఏర్పాటు చేయలేక గ్రామస్తులతో మాటలు పడాల్సి వస్తోందని వాపోయారు. తమ గ్రామం స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్–2023కు ఎంపికవడంతో.. మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టాలని అధికారులు ఒత్తిడి చేయడంతో భరించలేక సర్పంచ్ పదవికి రాజీనామా చేస్తున్నానని స్పష్టం చేశారు. రాజీనామా లేఖను డీపీవో దేవరాజుకు అందజేశారు. ప్రభుత్వ వైఖరికి నిరసనగానే తన పదవికి రాజీనామా చేసినట్లు వెల్లడించారు. కాగా, బీఆర్‌ఎస్ మద్దతుతో సర్పంచ్‌గా గెలిచిన ఓ మహిళా ప్రజాప్రతినిధి.. ప్రభుత్వ వైఖరికి నిరసనగా పదవి నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించడం చర్చనీయాంశంగా మారింది.



డీపీవోకు రాజీనామా లేఖ అందజేస్తున్న సర్పంచ్ దమ్మ లతాశ్రీ

జీవో 72ను రద్దు చేయాలి

- ఎంబీబీఎస్ సీట్ల కేటాయింపులో రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంపై హైకోర్టులో పిటిషన్

సాక్షి, హైదరాబాద్: కొత్త మెడికల్ కాలేజీల్లో కన్వీనర్ కోటాలోని 100 శాతం ఎంబీబీఎస్ సీట్లను రాష్ట్ర విద్యార్థులకే రిజర్వు చేస్తూ తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన జీవో నంబర్ 72ను కొట్టివేయాలంటూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. తెలంగాణ స్టేట్ మెడికల్ కాలేజెస్ అడ్మిషన్ రూల్స్‌కు సవరణ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం వారం క్రితం ఉత్తర్వులు జారీ చేసింది. దీని ప్రకారం 2014, జూన్ 2 తర్వాత ఏర్పాటు చేసిన మెడికల్ కాలేజీల్లోని కన్వీనర్ కోటాలోని 100 శాతం ఎంబీబీఎస్ సీట్లు తెలంగాణ విద్యార్థులకే రిజర్వ్ కానున్నాయి. ఈ మేరకు జూలై 3న జీవో నంబర్ 72ను విడుదల చేసింది. అంతకు ముందు 85 శాతం మాత్రమే స్థానిక విద్యార్థులకు ఉండగా, మిగతా 15 శాతం అన్‌రిజర్వుడుగా ఉండేది. ఇందులో తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు కూడా పోటీ పడేవారు. ప్రభుత్వ తాజా నిర్ణయంతో ఏపీ విద్యార్థులకు పోటీపడే అవకాశం ఉండదు. దీంతో ప్రభుత్వ ఉత్తర్వులను సవాల్ చేస్తూ విజయవాడకు చెందిన పి.సాయిసిరిలోచన, పి.చంద్రశేఖర్ తెలంగాణ హైకోర్టులో లంచ్‌మోషన్ రూపంలో పిటిషన్ దాఖలు చేశారు. జీవో 72 చట్టవిరుద్ధమని, కొట్టివేయడంతో పాటు కౌన్సిలింగ్‌లో పాత విధానాన్నే అనుసరించేలా ఆదేశాలివ్వాలని కోరారు. దీనిపై జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలి, జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు ధర్మాసనం విచారణ చేపట్టింది. వాదనలు వినిపించేందుకు సమయం కావాలని ప్రభుత్వం తరఫున ఏఏజీ కోరడంతో ధర్మాసనం విచారణను నేటికి వాయిదా వేసింది.

యూసీసీ చట్టమైతే కేసీఆర్ దేశం వీడొచ్చు

- ఎంపీ అర్వింద్

సాక్షి, హైదరాబాద్: పార్లమెంట్‌లో ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ)ఆమోదం పొందాక.. అది ఇష్టం లేకపోతే సీఎం కేసీఆర్ దేశాన్ని విడిచి పోవచ్చునని.. కావాలనుకుంటే పాకిస్తాన్ కూడా వెళ్లిపోవచ్చని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ వ్యాఖ్యానించారు. అది చట్టంగా మారి దేశంలో అమల్లోకి వచ్చాక కేసీఆర్ బహిష్కరించే పరిస్థితి ఉండదని స్పష్టం చేశారు. బీఆర్‌ఎస్ మద్దతు లేకుండానే ఈ బిల్లు పాసవుతుందని వ్యాఖ్యానించారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ యూసీసీని వ్యతిరేకించే పేరుతో ముస్లిం పెద్దలతో కేసీఆర్ భేటీ వెనుక ఆంతర్యం వేరే ఉందన్నారు. కర్ణాటక ఎన్నికల తర్వాత ముస్లిం ఓటింగ్ అంతా కాంగ్రెస్ వైపు మళ్లుతుందనే భయంతో.. వారిని మంచి చేసుకునేందుకే ఈ సమావేశం జరిగిందన్నారు.

లక్ష్మీబ్యారేజీలో 12 గేట్లు ఎత్తివేత



- ప్రాణహిత ఇన్‌ఫ్లో 39,560 క్యూసెక్కులు
- లక్ష్మీ పంపుహౌస్‌లో ఏడు మోటార్లతో ఎత్తిపోతలు

కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం ప్రాజెక్టు పరిధి మేడిగడ్డలోని లక్ష్మీబ్యారేజీకి ఎగువ మహారాష్ట్ర నుంచి ప్రాణహిత నది ద్వారా వరద ఉధృతి పెరుగుతోంది. దీంతో మంగళవారం ఇంజనీరింగ్ అధికారులు లక్ష్మీబ్యారేజీలోని మొత్తం 85 గేట్లలో 12 గేట్లు ఎత్తి నీటిని దిగువకు తరలిస్తున్నారు. ప్రాణహిత నది ద్వారా ఇన్‌ఫ్లో 39,560 క్యూసెక్కుల వరద తరలిరాగా 12 గేట్లు ఎత్తడంతో 36,360 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో దిగువకు తరలిపోయాయి. ప్రస్తుతం బ్యారేజీ వద్ద 12.77 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మహారాష్ట్ర నుంచి తరలివస్తున్న ప్రాణహిత నది వరదతో లక్ష్మీబ్యారేజీ వద్ద నిలిపిన జలాలు బ్యాక్‌వాటర్‌తో కాళేశ్వరంలో గోదావరి నది వరకు నిలిచాయి. కాళేశ్వరం పుష్కరఘాట్ వద్ద 7.460 మీటర్ల ఎత్తులో ఉన్న వరదనీటిని కన్నెపల్లిలోని లక్ష్మీపంపుహౌస్‌లోని ఏడు మోటార్ల ద్వారా డెలివరీ సిస్టర్న్‌లో ఎత్తిపోస్తున్నారు. ఏడు మోటార్లతో 14,826 క్యూసెక్కులు నీరు ఎత్తిపోయగా అన్నారం (సరస్వతీ)బ్యారేజీకి తరలిపోతున్నాయి. ఈనెల 3వ తేదీనుంచి ఇప్పటి వరకు 5.90 టీఎంసీల నీరు సరస్వతీ బ్యారేజీకి చేరినట్లు ఇంజనీర్లు తెలిపారు. లక్ష్మీపంపుహౌస్ నుంచి వచ్చిన ప్రాణహిత జలాలతో అన్నారం బ్యారేజీలో జలకళ నెలకొంది. బ్యారేజీలో మొత్తం 66 గేట్లు ఉండగా అన్నీ మూసి ఉంచారు. బ్యారేజీలో 7.96 టీఎంసీల నీటినిల్వ ఉంది.

ఇద్దరిని మింగిన ఇసుక కుంట

- స్నానం చేసేందుకు కుంటలో దిగిన చిన్నారులు
- బురదలో ఇరుక్కుని మృత్యువాత



కేళావత్ గణేష్



ముడావత్ శివ

హన్వాడ: వ్యవసాయ పొలంలో స్నానం చేసేందుకు దిగి బురదలో ఇరుక్కుపోయి ఇద్దరు చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు. ఈ సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా చిర్మల్ కుచ్చతండాలో చోటు చేసుకుంది. హన్వాడ మండలం చిన్నదర్పల్లి పరిధిలోని చిర్మల్ కుచ్చతండాకు చెందిన ముడావత్ రవి కుమారుడు శివ (9), అదే గ్రామానికి చెందిన కేళావత్ గోపి కుమారుడు గణేష్ (9) చిన్నప్పటి నుంచి స్నేహితులు. వీరిద్దరూ మహబూబ్‌నగర్‌లోని మోడల్ బేసిక్ పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్నారు. బోనాల పండుగ సందర్భంగా మంగళవారం పాఠశాలకు సెలవు ఇవ్వడంతో చిన్నారులిద్దరూ తండాలో ఉండిపోయారు. కాగా మధ్యాహ్నం ఆడుకుంటూ తండా సమీపంలోని నందిపేట ఆంజనేయులు వ్యవసాయపొలం వద్దకు వెళ్లారు. అక్కడ అక్రమ ఇసుక తయారీ కోసం తోడిన నీటికుంటలో స్నానం చేసేందుకు దిగారు. కుంట లోతుగా ఉండటంతో పాటు బురదగా ఉండడంతో ఇద్దరూ అందులో చిక్కుకుని మునిగిపోయారు. చిన్నారుల కోసం తల్లితండ్రులు వెతుకుతూ తండా సమీపంలోని నీటికుంటవైపు వెళ్లగా గట్టుపై పిల్లల దుస్తులు కనిపించాయి. దీంతో కుంటలో వెతకడంతో ఇద్దరి మృతదేహాలు బయటపడ్డాయి. విగతజీవులుగా మారిన చిన్నారులను చూసిన వారి తల్లిదండ్రులు గుండెలు బాదుకుంటూ రోదించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రవినాయక్ పేర్కొన్నారు. అయితే ఇద్దరు చిన్నారులను మింగిన నీటి కుంటను కొందరు అక్రమార్కులు ఫిల్టర్ ఇసుక తయారీకి తోడినట్లుగా తండావాసులు ఆరోపిస్తున్నారు.

జిల్లా వార్తలు

పళని ఆలయాన్ని సందర్శించిన ఎంపీ రవిచంద్ర

ఖమ్మంమయూరిసెంటర్: తమిళనాడులో పర్యటిస్తున్న పెట్రోలియం, సహజవాయువు పార్లమెంటరీ స్థాయీ సంఘం సభ్యుడు, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర – విజయలక్ష్మి దంపతులు పళనిలోని సుబ్రహ్మణ్యస్వామి ఆలయాన్ని మంగళవారం సందర్శించారు. స్థాయీ సంఘం చైర్మన్ రమేశ్ విధూరియా, సభ్యులతో కలిసి ఎంపీ ఆలయాన్ని సందర్శించి పూజలు చేశారు.

'సీతమ్మసాగర్'పై నేడు ఎన్‌జీటీ విచారణ



కుమ్మరిగూడెంలో నిర్మిస్తున్న సీతమ్మసాగర్ బ్యారేజీ

అశ్వాపురం: మండలంలోని కుమ్మరిగూడెంలో దుమ్ముగూడెం ఆనకట్ట దిగువన నిర్మిస్తున్న సీతమ్మసాగర్ బహుళార్థ సాధక ప్రాజెక్ట్‌పై జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ) చెన్నై ధర్మాసనం బుధవారం విచారించనుంది. పర్యావరణ అనుమతులు తీసుకోకుండానే ప్రాజెక్ట్ నిర్మిస్తున్నారని దుమ్ముగూడెం మండలానికి చెందిన ఇద్దరు నిర్వాసితులు ఎన్‌జీటీకి ఫిర్యాదు చేశారు. దీంతో పనులు నిలిపేయాలని మార్చి 23న ఎన్‌జీటీ ఉత్తర్వులు జారీ చేసినా పనులు ఆపకపోవడంతో పిటిషనర్లు మళ్లీ ఎన్‌జీటీని ఆశ్రయించారు. దీంతో మే 28న విచారించిన ఎన్‌జీటీ ఆదేశాలతో గత నెల 28న ద్విసభ్య కమిటీ పరిశీలించింది. కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా బుధవారం పిటిషన్‌ను విచారించనున్నారు. దీంతో ఎన్‌జీటీ వెలువరించే నిర్ణయంపై ఉత్కంఠ నెలకొంది.

జాతీయ సెయిలింగ్ పోటీలకు ఎంపిక



అఖిల్

ఖమ్మం స్పోర్ట్స్: హైదరాబాద్‌లోని హుస్సేన్ సాగర్‌లో జరగనున్న జాతీయస్థాయి ఓపెన్ సెయిలింగ్ టోర్నీకి ఖమ్మంకు చెందిన పిల్లి అఖిల్ ఎంపిక య్యారు. తెలంగాణ సెయిలింగ్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఈ పోటీలు జరగనున్నాయి. ఈసందర్భంగా అఖిల్ మాట్లాడుతూ పోటీల్లో సత్తా చాటుతానని ధీమా వ్యక్తం చేశారు.

తాలిపేరు ప్రాజెక్ట్‌లోకి చేరుతున్న వరద

- నీటిని నిల్వ చేసేందుకు గేట్లు మూసేసిన అధికారులు
- ఛత్తీస్‌గఢ్ పరిధిలో వర్షాలతో పెరుగుతున్న నీటిమట్టం



ప్రాజెక్ట్ గేట్లను దించడంతో పెరుగుతున్న నీటిమటం

చర్ల: మండలంలోని తాలిపేరు మధ్య తరహా ప్రాజెక్ట్‌కు చెందిన 26 క్రస్ట్ గేట్లను ప్రాజెక్ట్ అధికారులు కిందకు దించారు. రబీ సాగు పూర్తయ్యాక 25 గేట్లను పూర్తిగా ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. ఆతర్వాత ఏటా చేసినట్లుగా గేట్ల మరమ్మతులు చేపట్టారు. ప్రస్తుతం పనులు పూర్తి కావడంతో అధికారులు సోమవారం రాత్రి గేట్లను దించారు. ప్రాజెక్ట్‌లో సాగు అవసరాల కోసం ఐదు మీటర్ల మేర నీరు నిల్వ చేస్తున్నారు. అయితే, గేట్లు కిందకు దించిన 24 గంటల్లో 2.30 మీటర్ల నీరు నిలవగా మంగళవారం సాయంత్రానికి నీటిమట్టం 75 మీటర్లకు గాను 71.30 మీటర్లు(సిల్ లెవల్ 69మీటర్లు)గా నమోదైంది. ప్రాజెక్ట్ ఎగువ ప్రాంతమైన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్, సుకుమా, దంతెవాడ జిల్లాల అటవీ ప్రాంతాల్లో చెదురుముదురుగా వర్షాలు కురుస్తుండగా వారం రోజుల్లో నీటిమట్టం పూర్తి స్థాయికి చేరుకుంటుందని భావిస్తున్నారు. ప్రాజెక్ట్ ఆయకట్టు రైతులు ఇప్పటికే వరినార్లు పోయగా, మరో పది, పదిహేను రోజుల్లో వరి నాట్లు వేసేందుకు సిద్ధమవుతున్నారు.

ఆయిల్‌పామ్ రైతులను ఆదుకోవాలి



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న సొసైటీ బాధ్యులు

అశ్వారావుపేటరూరల్/దమ్మపేట: నానాటికీ ఆయిల్‌పామ్ ధర పడిపోతున్న నేపథ్యాన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను ఆదుకోవాలని తెలంగాణ ఆయిల్‌ఫెడ్ అశ్వారావుపేట జోన్ ఆయిల్‌పామ్ గ్రోవర్స్ సొసైటీ బాధ్యులు కోరారు. మంగళవారం ఖమ్మంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌ను కలిసి సమస్యలు వివరించారు. గత ఏడాది కంటే ఈసారి ఆయిల్‌పామ్ టన్ను ధర 50 శాతం మేర తగ్గుతున్నందున స్పందించాలని, ఆయిల్‌ఫెడ్ ద్వారా రైతాంగానికి నగదు చెల్లింపు విధానంలో మార్పులు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో సొసైటీ బాధ్యులు తుంబూరు ఉమామహేశ్వరరెడ్డి, కొక్కెరపాటి పుల్లయ్య, రావు జోగేశ్వరరావు, పగడాల రాంబాబు, ఆళ్ల నాగేశ్వరరావు, నవీన్ పాల్గొన్నారు.

ఐటీఐల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

మణుగూరు రూరల్ : ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో రెండో విడత ప్రవేశాల కోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని మణుగూరు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ బి.ప్రభాకర్ సూచించారు. ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్, మెకానికల్, కంప్యూటర్ ప్రోగ్రామింగ్ అసిస్టెన్స్(కోపా)లో ప్రవేశాల కోసం ఈనెల 31లోగా దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. ఎస్సెస్సీ ఉత్తీర్ణులై 1 ఆగస్టు 2023 నాటికి 14ఏళ్లు నిండిన వారు iti. telangana.govt.in ద్వారా సంప్రదించాలని సూచించారు.

వర్గీకరణ కోసం మరో ఉద్యమానికి సిద్ధం



అభివాదం చేస్తున్న మాదిగ హక్కుల దండోరా నాయకులు

ఖమ్మంమామిళ్లగూడెం: ఎస్సీ వర్గీకరణ కోసం మరో ఉద్యమానికి సిద్ధం కావాలని మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కొరివల్లి శ్రీనివాస్‌మాదిగ పిలుపునిచ్చారు. ఖమ్మంలోని అంబేడ్కర్ భవన్‌లో మంగళవారం జరిగిన ఉమ్మడి జిల్లాస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ బిల్లుకు వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం మాదిగ హక్కుల దండోరా ఖమ్మం, భద్రాద్రి జిల్లాల అధ్యక్షులుగా దుపెల్లి శ్రీను, దేవరకొండ కిరణ్, అధికార ప్రతినిధిగా సక్కుర్తి కోటేశ్వరరావు, మహిళా అధ్యక్షురాలిగా మారపోగు నాగమణి, ప్రచార కార్యదర్శిగా వీరస్వామి, యువసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా నరేశ్, మాదిగ స్టూడెంట్ యూనియన్ జిల్లా అధ్యక్షుడిగా కొండపల్లి మధు, ఖమ్మం, పాలేరు నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లుగా బంక వెంకన్న, గురవయ్యకు నియామకపత్రాలు అందజేశారు. సమావేశంలో నాయకులు నరేశ్, కాటయ్య, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

రామాలయ భూముల్లో అభివృద్ధికి సహకరించండి



ఏపీ మంత్రికి జ్ఞాపిక అందజేస్తున్న ఈఓ రమాదేవి



టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డితో ఈఓ, ఉద్యోగులు

ఏపీ దేవాదాయ శాఖ మంత్రిని కలిసిన భద్రాద్రి ఈఓ

భద్రాచలం: ఏపీలోని పురుషోత్తపట్నంలో ఉన్న భద్రాచలం శ్రీసీతారామ చంద్రస్వామి దేవస్థానం భూముల్లో అభివృద్ధి పనులకు సహకరించాలని ఆంధ్రప్రదేశ్ దేవాదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణను ఆలయ ఈఓ రమాదేవి కోరారు. విజయవాడలో మంగళవారం మంత్రిని ఈఓ సత్కరించి స్వామి వారి ప్రసాదాలు అందజేశారు. అనంతరం దేవాలయ భూముల్లో జరుగుతున్న అక్రమ నిర్మాణాలు, వాటిపై హైకోర్టు ఇచ్చిన తీర్పును వివరించారు. అలాగే, భూముల పరిరక్షణ, అక్రమ నిర్మాణాల అడ్డగింతకు శాఖ నుంచి సహకారం అందించాలని కోరారు.

గోకుల రామమ్‌కు టీటీడీ నిధులు

పురుషోత్తపట్నంలో దేవస్థానం ఆధ్వర్యాన గోకుల రామమ్ నిర్మాణానికి టీటీడీ తరఫున నిధులను కేటాయించాలని టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డిని ఈఓ కోరారు. మంగళవారం చైర్మన్‌ను కలిసిన ఆమె నిధులు కేటాయించడంతో పాటు ఆలయ అభివృద్ధిలో భాగంగా టీటీడీ తరఫున సహకరించాలని విన్నవించారు. ఆ తర్వాత టీటీడీ ఈఈ, డీఈలను కలిసి భద్రాచలంలో నిర్మించిన టీటీడీ సత్రంలో సౌకర్యాల కల్పనపై చర్చించారు. ఆలయ ఏఈఓలు శ్రావణ్‌కుమార్, భవానీరామకృష్ణ, ప్రధాన అర్చకులు విజయరాఘవన్, సిబ్బంది శ్రీనివాసరెడ్డి, కత్తి శ్రీనివాస్, అనిల్ పాల్గొన్నారు.

స్పాట్ కౌన్సెలింగ్‌ను పరిశీలించిన ఏపీఓ



ప్రిన్స్‌పాళ్లతో మాట్లాడుతున్న ఆర్‌సీఓ దేవిడ్‌రాజ్

భద్రాచలం: భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లోని రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలకు భద్రాచలంలో ఏర్పాటు చేసిన స్పాట్ కౌన్సెలింగ్ కొనసాగుతోంది. కౌన్సెలింగ్‌ను ఐటీడీఏ ఏపీఓ జనరల్, గురుకులాల ఇన్‌చార్జ్ ఆర్‌సీఓ దేవిడ్‌రాజ్ మంగళవారం పరిశీలించారు. సర్టిఫికెట్లు పరిశీలిస్తున్న అధికారులకు పలు సూచనలు చేసి విద్యార్థులు ఇబ్బంది పడకుండా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రెండో రోజు కౌన్సెలింగ్‌తో 515 ప్రథమ సంవత్సరం సీట్లు భర్తీ అయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో కళాశాలల ప్రిన్స్‌పాళ్లు పాల్గొన్నారు.

బలహీనవర్గాలపై చిన్న చూపు

- ప్రతీ లోక్‌సభ నియోజకవర్గం నుంచి మూడు సీట్లు కేటాయించాలి
- ఉమ్మడి జిల్లా బీసీ ఐక్య వేదిక సదస్సులో మాజీ ఎంపీ వీహెచ్



మాట్లాడుతున్న మాజీ ఎంపీ వీహెచ్, పక్కన దుర్గాప్రసాద్, ఎడవల్లి కృష్ణ, నాయకులు

ఖమ్మంసహకారనగర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడుగు బలహీన వర్గాలను చిన్నచూపు చూస్తున్నాయని మాజీ పార్లమెంట్ సభ్యుడు వి.హనుమంతరావు ఆరోపించారు. ఖమ్మంలోని కాంగ్రెస్ కార్యాలయంలో జిల్లా ఓబీసీ సెల్ అధ్యక్షుడు పుచ్చకాయల వీరభద్రం అధ్యక్షతన మంగళవారం ఉమ్మడి జిల్లా బీసీ ఐక్యవేదిక సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వచ్చిన వీహెచ్ మాట్లాడుతూ అత్యధిక ఓట్లు బడుగు, బలహీనవర్గాల వారివే అయినా ఆ ఓట్లతో గెలుస్తున్న నేతలు వారి సంక్షేమానికి కృషి చేయడం లేదన్నారు. దేశంలో మొదటగా భూ సంస్కరణలు అమలుచేసి ధనికుల భూములను బడుగు బలహీన వర్గాలకు పంపిణీ చేసిన ఘనత ఇందిరా గాంధీకే దక్కుతుందని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాల్సి ఉందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే కులగణన చేపట్టి తదనుగుణంగా బీసీ రిజర్వేషన్ సవరిస్తామని తెలిపారు. కాగా, రాష్ట్రంలో 50 శాతం ఉన్న బీసీలకు ప్రతీ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి మూడేసి సీట్లు కేటాయించాలని వీహెచ్ డిమాండ్ చేశారు. డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పుచ్చకాయల వీరభద్రం, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎడవల్లి కృష్ణ మాట్లాడుతూ అన్ని వర్గాలకు తమ పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. త్వరలో రాహుల్‌గాంధీ నేతృత్వాన నిర్వహించనున్న బీసీ గర్జనను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం భట్టి పాదయాత్రలో ప్రారంభం నుంచి ముగింపు వరకు పాల్గొన్న నేలకొండపల్లి మండలానికి చెందిన నాయకుడు జెర్రిపోతుల అంజనీకుమార్‌ను వీహెచ్ తదితరులు సన్మానించారు. సమావేశంలో ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు కొత్తా సీతారాములుతో పాటు నాయకులు వడ్డెబోయిన నర్సింహారావు, శేఖర్‌గౌడ్, బొందయ్య, బుక్కా కృష్ణవేణి, తుమ్మా రాంబాబు, మోతుకూరి ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.